# ఆదరించమ్మా.. ఆది పరాశక్తి


వివిధ వేషధారణలో ఆర్.కె.అబాకస్ విద్యార్థులు


గంగమ్మను దర్శించుకున్న దినేష్‌రెడ్డి


దొరవేషంలో చిన్నారులు

- నాలుగో రోజు ప్రత్యేక పూజలు
- ఇంటింటా పూజలందుకున్న దొర వేషధారులు



**తిరుపతి కల్చరల్:** తాతయ్యగుంట గంగమ్మ జాతర సందర్భంగా నాలుగో రోజు శనివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివరావడంతో ఆలయం కిటకిటలాడింది. భక్తులు గంగబొట్లు పెట్టుకొని, వేపాకు నడుముకు కట్టుకుని ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించి మొక్కులు చెల్లించారు. వేయి కళ్ల దుత్తలతో ప్రదక్షిణ చేశారు. కొంతమంది కుటుంబ సమేతంగా ఆలయానికి వచ్చి పొంగళ్లు పెట్టి అమ్మవారికి సమర్పించారు. సంప్రదాయబద్ధంగా ఆలయం తరఫున కైకాల కులస్తులు దొరవేషం, చాకలి కులస్తులు మంత్రి వేషం ధరించి నగరంలో తిరుగుతూ ప్రతి ఇంటా పూజలు అందుకున్నారు.

**నేడు మాతంగి వేషం**

తాతయ్యగుంట గంగమ్మ జాతరలో ఐదవ రోజు ఆదివారం మాతంగి వేషాన్ని గుడి తరఫున మీరాశిదార్లు, మొక్కుబడి ఉన్న స్థానికులు ధరిస్తారు. మిరాశీదార్లు వేసే మాతంగి వేషంలో కైకాల కులస్తు డొక్కరే పాల్గొంటారు.

## గంగమ్మకు సారెల సమర్పణ

**తిరుపతి కల్చరల్/తిరుపతి మంగళం:** తాతయ్యగుంట గంగమ్మకు శనివారం పలు సంస్థల ప్రతినిధులు సారెలు సమర్పించారు. ఇందులో భాగంగా టౌన్ బ్యాంక్ చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి, ఆయన సతీమణి, కార్పొరేటర్ జానకి, వైస్ చైర్మన్ వాసుయాదవ్, డైరెక్టర్లు తదితరులు సారె అందజేశారు. అలాగే శుభమస్తు షాపింగ్ మాల్ ప్రతినిధులు సారెకు పూజలు చేసి ఊరేగింపుగా గంగమ్మ ఆలయం వద్దకు చేరుకున్నారు. తిరుపతి క్లాత్ మర్చంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గంగమ్మకు సారె సమర్పించారు. పార్లవీధిలోని అసోసియేషన్ కార్యాలయంలో సారెకు పూజలు చేసి ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. క్రెడాయ్ చైర్మన్ వసంతం శ్రీనివాసులు ఆధ్వర్యంలో వేశాలమ్మకు సారె సమర్పించారు.

**గంగమ్మ సేవలో దినేష్‌రెడ్డి**

తాతయ్యగుంట గంగమ్మను శనివారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బావమరిది దినేష్‌రెడ్డి దర్శించుకున్నారు. ఆయనకు ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, డెప్యూటీ మేయర్ అభినయరెడ్డి స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం ఆలయ పనులపై చర్చించారు.


సారె అందజేస్తున్న టౌన్ బ్యాంక్ చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి, జానకి, ఎండీ భారతి


సారెకు పూజలు చేస్తున్న తిరుపతి క్లాత్ మర్చంట్ అసోసియేషన్ నేతలు


సారెను తీసుకొస్తున్న శుభమస్తు అధినేతలు

## శాస్త్రోక్తంగా మహా శాంతి తిరుమంజనం



**తిరుపతి కల్చరల్:** కపిలతీర్థంలోని పురాతన శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయ మహా సంప్రోక్షణలో భాగంగా శనివారం మహా శాంతి తిరుమంజనాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం యాగశాలలో వైదిక కార్యక్రమాలు, అక్షిణ్మోచనం, పంచగవ్యాధివాసం, క్షీరాధివాసం, జలాధివాసం, రత్నన్యాసం, బింబస్థాపన, అష్టబంధన, కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేపట్టారు. సాయంత్రం బింబవాస్తు, నవ కలశ చతుర్దశ కలశ స్నపనం, మహాశాంతి తిరుమంజనం, పూర్ణాహుతి, శయనాధివాసం నిర్వహించారు. ఆదివారం ఉదయం 9 నుంచి 10 గంటల మధ్య మిథున లగ్నంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి వారికి మహా సంప్రోక్షణ నిర్వహిస్తారు. తర్వాత భక్తులకు సర్వదర్శనం ప్రారంభమవుతుంది.

## లోక్ అదాలత్‌లో 1597 కేసుల పరిష్కారం

**తిరుపతి లీగల్ :** తిరుపతి కోర్టు ఆవరణలో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో 1597 కేసులు పరిష్కారమైనట్లు తిరుపతి 3వ అదనపు జిల్లా జడ్జి ఎం.గురునాథ్ తెలిపారు. పరిష్కారమైన కేసుల్లో సివిల్- 22, క్రిమినల్ -189, మోటార్ వాహన ప్రమాద-04, వివాహ సంబంధ కేసులు ఒకటి ఉన్నట్టు తెలిపారు. అలాగే బ్యాంకులకు సంబంధించిన వ్యాజ్యం వేయని 17 కేసులు ఉన్నాయన్నారు. 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు పరిధిలో 115 కేసులు పరిష్కరించి రూ.2,40,500 జరిమానా, 3వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు పరిధిలో 8 కేసులు పరిష్కరించి రూ.42,750 వేల జరిమానా, 5వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు పరిధిలో 11 కేసులు పరిష్కరించి రూ.21 వేలు జరిమానా విధించినట్టు తెలిపారు. తిరుపతి మొదటి, రెండవ ప్రత్యేక మెజిస్ట్రేట్ కోర్టుల పరిధిలో 1,230 కేసులు పరిష్కరించి నిందితులకు రూ.6.80 లక్షలు జరిమానా విధించినట్టు పేర్కొన్నారు.



## తిరుపతి నగర అభివృద్ధే లక్ష్యం

**తిరుపతి మంగళం :** తిరుపతి నగర అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి తెలిపారు. ఆయన శనివారం 50వ డివిజన్ కార్పొరేటర్ బోకం అనీల్‌కుమార్‌తో కలిసి మానస సరోవర్ ప్రధాన మార్గంలో చేపట్టిన తారు రోడ్డు పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మాస్టర్ ప్లాన్ రోడ్లతో తిరుపతి నగరం దశ మారుతుందన్నారు. శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులు, నగర ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అందులో భాగంగానే మానస సరోవర్, ఉపాధ్యాయనగర్ వంటి ప్రాంతాలకు వెళ్లే మార్గంలో సుమారు రూ.85 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు.

## మిస్టరీ మంటలపై అధికారుల పరుగులు

- రహస్యాన్ని ఛేదించాలని జిల్లా కలెక్టర్, ఎస్పీ ఆదేశం
- గ్రామస్తులకు మోహిత్‌రెడ్డి భరోసా
- బాధితులకు రూ.5 వేలు సాయం

సాక్షి ఎఫెక్ట్..

**చంద్రగిరి(తిరుపతి రూరల్):** అక్షరం అధికారులు, ప్రజాప్రతినిధులను పరుగులు పెట్టించింది. చంద్రగిరి మండలం కొత్త శానంబట్లలో 20 రోజులుగా గ్రామస్తులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్న మంటలపై సాక్షిలోశనివారం 'శానంబట్లలో మిస్టరీ మంటలు' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వరరెడ్డి స్పందించారు. మిస్టరీని ఛేదించాలని అధికారులను ఆదేశించారు. చంద్రగిరి డీఎస్పీ యశ్వంత్, తహసీల్దార్ శిరీష, ఎంపీడీఓ రమేష్ బాబు గ్రామాన్ని సందర్శించారు. బాధితులతో మాట్లాడారు. క్లూస్ టీంను రప్పించి మరింత కుణ్ణంగా పరిశీలించాలని సూచించారు.

**గ్రామస్తులకు మోహిత్‌రెడ్డి భరోసా**

శానంబట్ల గ్రామాన్ని శనివారం వైఎస్సార్‌సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, చంద్రగిరి మార్కెట్ యార్డు చైర్మన్ సురేష్‌రెడ్డి సందర్శించారు. మంటలతో ఆర్థికంగా దెబ్బతిన్న కుటుంబాలను ఆదుకుంటామని భరోసా కల్పించారు. ఒక్కో కుటుంబానికి రూ.5 వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు. ప్రతి ఇంటిలోనూ వైరింగ్‌ను తనిఖీ చేయాలని విద్యుత్ అధికారులకు సూచించారు. గ్రామస్తుల కోరిక మేరకు గ్రామంలో శాంతి పూజలు నిర్వహించేందుకు సాయం అందించారు. అనంతరం అధికారులతో కలిసి గ్రామంలో పర్యటించారు. తర్వాత నాని సైతం గ్రామంలో పర్యటించారు. బాధితులకు ఆర్థిక సాయం అందించారు.


కాలిన ఇంటిని పరిశీలిస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, అధికారులు

**గ్రామంలో పోలీస్ పికెటింగ్**

గ్రామస్తుల ఆందోళన నేపథ్యంలో పరిస్థితి సాధారణ స్థితికి వచ్చే వరకు గ్రామంలో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు చంద్రగిరి డీఎస్పీ యశ్వంత్ తెలిపారు. ఎలాంటి భయాందోళనలు వద్దని పోలీస్ రక్షణ ఉంటుందని భరోసా ఇచ్చారు.

## గోవింద నామస్మరణతో శోభారాజు సంకీర్తనార్చన



**తిరుమల:** తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి 'సహస్ర దీపాలంకరణ' సేవలో శనివారం సాయంత్రం పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ శోభారాజు తన శిష్యులతో సంకీర్తనాలాపన చేశారు. ఆమెకు శిష్యులు కుమారి చైత్ర, కుమారి రన్వితా గాత్ర సహకారం అందించారు. కీబోర్డ్ కళ్యాణ్, తబలా వాద్య సహకారం మంజునాథ్ అందించారు.

### ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తులు

**పాకాల :** స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ చంద్రమ్మ తెలిపారు. ఈ నెల 15 నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. వివరాలకు ప్రిన్సిపాల్‌తోపాటు 08585-222355లో సంప్రదించాలన్నారు.

### సమ్మర్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలి

**పాకాల:** రాష్ట్ర ప్రభుత్వం వేసవి సెలవుల్లో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన సెలవుల్లో సరదాగా సమ్మర్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ బాబ్జీ తెలిపారు. ఆయన శనివారం ఎంపీపీ, ఎంపీయూపీ పాఠశాలల హెచ్‌ఎంలకు సమ్మర్ క్యాంప్ పుస్తకాలు అందజేశారు.

### నేడు మంత్రి రోజా పర్యటన

**నగరి :** మంత్రి ఆర్‌కే రోజా ఆదివారం నిర్వహించే పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఉదయం 9 గంటలకు తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతర సందర్భంగా తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో తాళ్లపాక గంగమ్మ ఆలయం నుంచి కాలినడకన వెళ్లి పట్టువస్త్రాలు సమర్పిస్తారు. సాయంత్రం 5 గంటలకు వడమాలపేట మండలం కాయం గ్రామంలో రామాలయం దగ్గర ది వరల్డ్ కమ్యూనిటీ సర్వీస్ సెంటర్-విలేజ్ సర్వీస్ ప్రాజెక్ట్ వారి యోగా శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు.

### సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

**తిరుపతి రూరల్:** అనారోగ్యంతో బాధపడుతున్న వారికి సీఎం సహాయ నిధి నుంచి వచ్చిన చెక్కులను వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి శనివారం అందజేశారు. తిరుపతి రూరల్ మండలం చెర్లోపల్లికి చెందిన హరికృష్ణ కుమారుడికి రూ.10 లక్షలు, ముంగిళిపట్టు పంచాయతీకి చెందిన జగన్నాథంకు రూ.3.20 లక్షలు మంజూరయ్యాయి.

### నేడు భక్తి చైతన్య యాత్ర

**తిరుపతి కల్చరల్:** గంగమ్మ జాతరలో భాగంగా ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు చేపట్టే భక్తి చైతన్య యాత్రలో వేలాదిగా పాల్గొనాలని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి పిలుపునిచ్చారు. భక్తి చైతన్య యాత్ర తిరుపతికి తొలి గడపగానున్న అనంతవీధి నుంచి పరసాల వీధి, రామచంద్ర పుష్కరిణి, ఎస్పీ కార్యాలయ మీదుగా గంగమ్మ ఆలయానికి చేరుకుంటుందన్నారు.

### పర్యావరణ పరిరక్షణకు సహకారం

**తిరుపతి అర్బన్:** పర్యావరణ పరిరక్షణకు సహకరిస్తామని పొల్యూషన్ బోర్డు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నరేంద్రబాబు తెలిపారు. లైఫ్ స్టైల్ ఎన్విరాన్‌మెంట్‌లో భాగంగా శనివారం తిరుపతిలో సైకిల్ ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీ తారకరామారావు స్టేడియం నుంచి టౌన్ క్లబ్ వరకు సాగింది. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. వికాస్ సింగ్, సహాయ ఇంజినీర్ మదన్‌మోహన్‌రెడ్డి, కిషోర్‌రెడ్డి, శశికళ, ఆర్.కుమార్ పాల్గొన్నారు.

### నేటి నుంచి మహతిలో అన్నమయ్య జయంతి ఉత్సవాలు

**తిరుపతి కల్చరల్:** మహతిలో ఆది, సోమవారాల్లో అన్నమయ్య జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు భారత్ ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షుడు కేవీ.రమణారావు తెలిపారు. ఆయన శనివారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు.

### ఆకట్టుకున్న నృత్యాభినయం

**తిరుచానూరు(చంద్రగిరి):** శిల్పారామంలో వారాంతపు కార్యక్రమాల్లో భాగంగా శనివారం సాయంత్రం నిర్వహించిన నృత్యాభినయం ప్రేక్షకులను ఆకట్టుకుంది. బైరెడ్డిపల్లి కళాతరంగిణికి చెందిన రాజేష్ బాబు బృందం కళాకారులు పలు పాటలకు చక్కటి హావభావాలతో అభినయించారు. వారిని శిల్పారామం ఏఓ ఖాదర్‌వలి వారిని సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు.